క్లుప్తంగా

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

ఇల్లెందు: క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకునేవారు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి సరైన సమయంలో అండగా నిలిచేవారు జీవితం పట్ల అర్థం తెలిసేలా కౌన్సెలింగ్ ఇచ్చి ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలని, అలా చేస్తే ఎన్నో జీవితాలు నిలబడతాయని డీఎస్పీ ఎస్వీ రమణమూర్తి అన్నారు. బుధవారం ఇల్లెందులోని తన కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీఐ సందీప్‌కుమార్, కోటేశ్వరరావు, నరేష్ ఉన్నారు.

పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా యూసఫ్

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా యూసఫ్ నియామకమయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్ జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న యూసఫ్ ఇక్కడికి రానున్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న అజ్మీరా స్వామి వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

'గూడెం' కమిషనర్‌గా శేషాంజనేయ స్వామి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్‌గా శేషాంజనేయ స్వామి నియమితులయ్యారు. బదిలీలో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న జి.రఘు, రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్‌కు బదిలీ అయ్యారు. పరకాల మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేస్తున్న శేషాంజనేయ స్వామి కొత్తగూడెం మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సీతారాములు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని గణేష్ టెంపుల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అన్నారు. అన్నదానం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు పల్లపోతు వాసు, సంకా శ్రీనివాస్‌రావు, పల్లపోతు నవీన్, దీపక్ అగర్వాల్, బోగా నారాయణ, బోగా శ్రీనివాస్ ఉన్నారు.

సింగరేణి మైదానంలో 'వాకింగ్'

- మొదలైన ట్రాక్ నిర్మాణ పనులు
- క్రీడాకారులకు ఎంతో మేలు



సింగరేణి హైస్కూల్ మైదానం

ఇల్లెందు: మనుషులు ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 30 నిముషాల పాటు వ్యాయామం, నడక అవసరం అని డాక్టర్లు సూచిస్తున్నారు. ఏ అనారోగ్యం వచ్చినా, ఏ ఆస్పత్రికి వెళ్లినా మందులతో పాటు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం, నడక ఉండాలంటున్నారు. ఈ తరుణంలో ఇల్లెందు పట్టణ నడిబొడ్డున ఉన్న సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో స్థానికులు నడక, వ్యాయామం కొనసాగిస్తున్నారు. అయితే ఈ సింగరేణి గ్రౌండ్‌లో కనీస సదుపాయాలు లేవు. ఏళ్ల తరబడి ఎంతోమంది జీఎంలు వస్తున్నారు, వెళుతున్నారు, కానీ గ్రౌండ్‌ను పట్టించుకున్న వారు లేరు.

ప్రస్తుత జీఎం జాన్ ఆనంద్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్లు, మరుగు దొడ్లు, మంచినీటి సాదుపాయం కల్పించేందుకు ఇటీవల గ్రౌండ్‌ను సందర్శించి పరిశీలించారు. అక్కడి ఫుట్‌బాల్ కోర్ట్, రన్నింగ్, వాకింగ్ ట్రాక్‌ను, ఓపెన్ జీమ్‌ను, షటిల్ కోర్టులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలించిన మరుసటి రోజు నుంచే ట్రాక్ పనులు ప్రారంభయ్యాయి. పది రోజుల్లో వాకింగ్, వ్యాయమం కోసం సదుపాయాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

క్రీడాకారులకు ఉపయోగం..

విద్యార్థులు, క్రీడాకారులు తర్ఫీదు పొంది ప్రతిభాపాటవాలను ప్రదర్శించుకునేందుకు సింగరేణి గ్రౌండ్ ఎంతో ఉపయోగపడనుంది. క్రీడారంగంలో రాణించేందుకు తగిన సదుపాయాలు కల్పిస్తే ఆటపాటల ద్వారా ఉన్నత శిఖరాలను అందుకోవచ్చు. నేటికీ పలు పట్టణాల్లో, పల్లెల్లో క్రీడలకు తగిన సదుపాయాలు లేవు. తద్వారా అక్కడి యువత తనలోని ప్రతిభను చాటుకోలేకపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ మినహా ఇతర ఎన్నో రకాల ఆటలు ఉన్న విషయం అక్కడి యువతకు తెలియని పరిస్థితి నెలకొంది.

ఎటువంటి ప్రమాదాలు ఉండవు...

సింగరేణి స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. దీనివల్ల ప్రతీఒక్కరు వాకింగ్ చేసుకుని ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుంది. ప్రతీఒక్కరికీ ఆరోగ్యపరంగా వాకింగ్ అవసరం అవుతున్న తరుణంలో ట్రాక్ మీద నడవటం వల్ల ప్రమాదాలు ఉండవు.

ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటైతే మేలు..

సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ కోర్టు, బాస్కెట్ బాల్, వాలీబాల్, బార్‌లు, రింగులు,



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జీఎం జాన్‌ఆనంద్ (ఫైల్)

ఇలా పలు రకాల పరికరాలు ఉన్నాయి. అయితే వీటికి అనుబంధంగా ఓపెన్ జీమ్ ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరుతున్నారు.

సదుపాయాలు కల్పించండి..



పట్టణ నడిబొడ్డున గల సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో అన్ని సదుపాయాలు కల్పిస్తే క్రీడాకారులకు, విద్యార్థులకు, వాకర్స్‌కు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఆరోగ్యవంతులుగా జీవించేందుకు ప్రతీఒక్కరు రోజుకు గంట నడక సాగిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, ఇతర ఆటల పరికరాలు అందుబాటులో ఉంటే బావుంటుంది.

– పులి సైదులు, ఇల్లెందు

వసతుల కల్పనకు కృషి...



పట్టణ ప్రజలకు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు ఉపయోగపడేలా సదుపాయాలు కల్పిస్తాం. ఇప్పటికే జీఎం జాన్‌ఆనంద్‌తో కలిసి గ్రౌండ్‌ను పరిశీలించి అంచనా రూపొందించి అనుమతి పొంది, ఏర్పాట్లు చేస్తున్నాం. మార్చి 1 నాటికి అన్ని పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

– నజీర్ అహ్మద్, సింగరేణి గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ, ఇల్లెందు

ప్రారంభమైన వనదేవతల జాతర



జూలూరుపాడు: సమ్మక్క గద్దె వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఇల్లెందురూరల్: వన దేవతలను గద్దెల మీదకు తీసుకొస్తున్న భక్తులు

జూలూరుపాడు: మండలంలో పడమటనర్సాపురంలో చిలుకలగుట్ట వద్ద కొలువైన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ఆలయ ప్రధాన పూజారి కర్రం నరసింహారావు ఆధ్వర్యాన పూజారులు, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, కులపెద్దలు, మహిళలు ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ నానబాల బియ్యం, పసుపు, కుంకుమ తీసుకుని గద్దెల వద్దకు చేర్చారు. ఆ తర్వాత పూజారులు ఆధ్వర్యాన పుట్టబంగారాన్ని మహిళలు గద్దెల వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. సాయంత్రం సారలమ్మ దేవతను వనంలోని నుంచి గద్దెపైకి తీసువచ్చి ప్రతిష్ఠాపన చేయడంతో జాతర ప్రారంభమైంది. ఇక గురువారం వనం నుంచి సమ్మక్క తల్లి గద్దెపైకి రానుండగా.. జాతర మరో మూడు రోజులు పాటు సాగుతుంది. భక్తులు తొలిరోజే పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించడంతో పాటు బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. కాగా, జాతర ప్రాంగణంలో బంగారం(బెల్లం), పూజా సామాగ్రి తదితర దుకాణాలు ఏర్పాటు కాగా, జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన విస్తృత ఏర్పాట్లు చేశారు. అలాగే, ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

కొమరారంలో...

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు ఐక్యంగా మేడారాన్ని తలపించే విధంగా జాతర ఏర్పాట్లు ఘనంగా చేశారు. గ్రామ శివారులోని వనంలో భక్తులు ఏర్పాటు చేసిన అమ్మవార్ల గద్దెల వద్దకు భారీగా తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను గద్దెల మీదకు తీసుకొచ్చేందుకు గ్రామస్తులంతా సమష్టిగా డప్పు నృత్యాలతో గుట్టల చెరువు సమీపంలోని వనంలోకి తరలివెళ్లారు. అనంతరం అమ్మవార్లను గద్దెల మీదకు తీసుకొచ్చే సమయంలో పలువురు మహిళలను అమ్మవారు ఆవహించడంతో వారి నుంచి వచ్చే పలుకుల వినేందుకు భక్తులు ఆసక్తి చూపారు. అమ్మవారు గద్దెనెక్కే సమయంలో భక్తులు సమ్మక్కను తరిస్తూ చేసిన పలుకులు వనంలో మార్మోగాయి.

హర్షం

పాల్వంచ: రాజ్యసభ సభ్యురాలిగా కాంగ్రెస్ పార్టీ రేణుకా చౌదరిని ఎంపిక చేయడం పట్ల ఎల్‌డీఎం కోఆర్డినేటర్ బద్ది కిశోర్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌కే చాంద్‌పాషా, సూర్యకిరణ్, భట్టు వీరు, మధు, భట్టు లక్ష్మణ్, నసీబ్, సాంబశివరావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు జారీ చేయాలి

జూలూరుపాడు: కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందజేశారు. తంబర్ల నరసింహారావు, దేవరకొండ మనోహర్, కార్తీక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ఇల్లెందు: బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 3వ వార్డు కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావు పార్టీ పదవికి రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుకు అందజేసినట్లు తెలిపారు. ఇటీవల అవిశ్వాసం సందర్భంగా ఆయనను కాంగ్రెస్ పార్టీ నేతలు ఎత్తుకెళ్లారు. ఆయన సతీమణి వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ, ఎంపీపీ నాగరత్నమ్మలతో పాటు 17 మంది మీద పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఒకటి రెండురోజుల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని తెలిసింది.

పీఏసీఎస్ వైస్‌చైర్మన్...

ఇల్లెందురూరల్: ప్రాథమిక సహకార సంఘం వైస్ చైర్మన్ పదవికి బండారు శ్రీనివాస్ బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పీఏసీఎస్ అధికారులకు, చైర్మన్ మెట్టెల కృష్ణకు అందజేశారు. రెండు రోజుల క్రితం పీఏసీఎస్ పది మంది డైరెక్టర్లు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో తనకు పదవులపై వ్యామోహం లేదని, డైరెక్టర్లు నేరుగా కోరితే తానే రాజీనామా చేసేవాడినని బండారు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

సమ్మెకు దూరంగా ఉండండి..



మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కొన్ని కార్మిక సంఘాలు తలపెట్టిన ఒక్కరోజు సమ్మెకు కొత్తగూడెం ఏరియా కార్మికులు దూరంగా ఉండాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు తెలిపారు. బుధవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 16న జాతీయ స్థాయిలో జరగనున్న టోకెన్ సమ్మెలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనరాదని, ఈ సమ్మెకు పిలుపునిచ్చిన యూనియన్ల డిమాండ్లలో ఏదీ సింగరేణి సంస్థకు సంబంధించినవి కావని, సమ్మెలో పాల్గొంటే కంపెనీకి, ఉద్యోగులకు తీవ్రనష్టం కలుగుతుందని, ఉద్యోగులు ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని సమ్మెకు దూరంగా ఉండి విధులకు హాజరు కావాలని కోరారు. ఒక్కరోజు సమ్మెలో పాల్గొనటం ద్వారా కంపెనీ ఉత్పత్తికి రూ.85 కోట్లు, కార్మికులకు వేతనాల రూపంలో రూ.18కోట్లు నష్టం వస్తుందన్నారు. కాబట్టి కార్మికులు ఈ విషయాలను గమనంలోకి తీసుకొని విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విధులకు హాజరుకండి...

రాజకీయ ప్రేరేపిత ఒక్కరోజు టోకెన్ సమ్మెను వ్యతిరేకించాలని ఏబీకేఎంఎస్ (బీఎంఎస్) జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మాధవ నాయక్ అన్నారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో ఫిబ్రవరి 16న ఒక్కరోజు సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చాయి. ఈ డిమాండ్లలో కార్మికులను గానీ వాళ్ల హక్కులు కాపాడే విధంగా ఏమీ లేవన్నారు. కావాలనే రాజకీయంగా వాళ్ల సంఘాల ఉనికిని కాపాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వం మీద వ్యతిరేకతతో రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి చేస్తున్న సమ్మెగా బీఎంఎస్ భావిస్తోందని, ఈ సమ్మెలో పేర్కొన్న డిమాండ్లు సింగరేణి యాజమాన్య పరిధిలో లేవన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపులో సింగరేణి కొంత వెనకబడి ఉందని, ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతీరోజు సాధించే ఉత్పత్తి ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు దూరంగా ఉంటూ విధులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో పవన్ కుమార్, కృష్ణారెడ్డి, సంఘం చందర్, ఎం.మోహన్‌రావు, మూర్తి, రాజమౌళి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్ల పాత్ర కీలకం

పాల్వంచ: విద్యుత్ సంస్థల అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమైందని జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో తెలంగాణ ఎలక్ట్రీసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కేక్ కట్ చేశారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. మాట్లాడుతూ. సంస్థ ప్రయోజనాల విషయంలో విద్యుత్ ఉద్యోగులు ముందస్తు ప్రణాళికలతో కృషి చేస్తుంటారన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్‌ను సాధించి కృషి చేస్తుండటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సమీర్ అహ్మద్, ఉమారావు, కె.వినోద్ కుమార్, ఎస్‌కే.ఇమ్రాన్, యాదగిరి, నరోత్తం, జాదవ్, చందు, అనిల్‌కుమార్, సురేష్, వేణు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ సేవలు అందించాలి



నెట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కొత్వాల

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాలకు ఆధార్ సేవలను విస్తరింపజేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి యానంబైల్ గ్రామంలో బుధవారం కామన్ నెట్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడారు. మండలంలో మారుమూలకు గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని ఏదైనా దరఖాస్తు చేసుకోవాలంటే 20 కిలోమీటర్లపైన వ్యయ ప్రయాసలకోర్చి మండల కేంద్రమైన పాల్వంచ పట్టణానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆన్‌లైన్ సెంటర్‌ను యానంబైల్ గ్రామంలో ఏర్పాటు చేయడం వలన ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, శ్రీనివాసరెడ్డి, డీఎం మధుసూదన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బుడగం రాంమోహన్‌రావు, యర్రంశెట్టి మధు, బుడగం మోహన్‌రావు, బుడగం కిరణ్, వాసం మంగయ్య, రాము, చిరంజీవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య దంపతులు

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలోని కోల్ ప్లాంట్ వద్ద శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య దంపతులు పాల్గొన్నారు. సీఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఈలు జి.రాజ్‌కుమార్, డీవైసీసీఏ కె.నాగరాజు, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పి.అప్పాజీ, డీఈ ఎస్ఎస్ఎస్ శేఖర్, బి.హరిలాల్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, ఎం.బలరామ్, బి.మంగీలాల్, బి.రవీందర్, ఎం.కిశోర్, వై.వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

మున్సిపల్‌కు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు



ఫొటోలు అందిస్తున్న నాయకులు

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలు పెట్టకపోవడం విచారకరమని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోలను మున్సిపాలిటీ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. తక్షణం కార్యాలయంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో ఐతా గంగాధర్, బద్ది కిషోర్, భట్టు మురళీ, మధు, జోషి, ఓలపల్లి రాంబాబు, బీఎస్ చారి, బాబు, సాంబయ్య, గౌస్, రవూఫ్, సందీప్, ఆనంద్, జయరాజ్, ఇమ్మానియేల్, హుస్సేన్, గోపి తదిరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళి

కొత్తగూడెంరూరల్: ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు (70) బుధవారం మృతి చెందారు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో మల్లు వెంకటేశ్వర్లు పార్థీ దేహాన్ని సీనీ గీత రచయిత గాయకులు మద్దెల శివకుమార్, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు, చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంతోటిపాల్ తదితరులు సందర్శించి నివాళి అర్పించారు.

విధుల్లో చేరిన బదిలీ అధికారులు, ఉద్యోగులు



జి.వివేక్, తహసీల్దార్, పాల్వంచ



పి.శ్రీకాంత్, ఎస్‌ఐ, బోడు



స్వాతిబిందు, తహసీల్దార్, జూలూరుపాడు



డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, జూలూరుపాడు

చుంచుపల్లి: బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నూతనంగా వచ్చిన డీఆర్డీఓ మెరుగు విద్యాచందన, డీపీఓ చంద్రమౌళి, డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్, అదనపు డీఆర్డీఓ (సెర్ప్) జయశ్రీ, సహకారశాఖ అధికారి ఖుర్షీద్, ఖమ్మం జిల్లా నుంచి చుంచుపల్లి మండలానికి ఎంపీడీఓగా వచ్చిన అశోక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం అధికారులు కలెక్టర్ ప్రియాంకను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా విధుల్లో చేరిన జిల్లా స్థాయి అధికారులకు సిబ్బంది పలకరింపులతో కార్యాలయాలు సందడిగా మారాయి.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎంపీడీఓగా చలపతిరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల స్పెషల్ అధికారి శ్రీనివాస్‌రావు, సూపరిండెంటెంట్ అంకుబాబు ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

జూలూరుపాడు: జూలూరుపాడు తహసీల్దార్‌గా కె.స్వాతిబిందు, ఎంపీడీఓగా దగ్గుల కరుణాకర్‌రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా వెంగన్నపాలెం జీపీ సెక్రటరీగా లక్ష్మీనారాయణ, గుండ్లరేవు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎస్.కార్తీక్‌లు బుధవారం విధుల్లో చేరారు.

పాల్వంచరూరల్: పాల్వంచ తహసీల్దార్ నగరాజు బదిలీ కావడంతో ఆయిన స్థానంలో మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.వివేక్ పాల్వంచ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. అదేవిధంగా పాల్వంచ ఎంపీడీఓ అప్పారావు బదిలీ కాగా అయిన స్థానంలో ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కుడుముల విజయభాస్కర్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బుధవారం వారు బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచలోని కాంతనపల్లి ప్రాజెక్టు (భూసేకరణ)యూనిట్2 స్పెషల్ డిప్యూటీకలెక్టర్‌గా కె.శంకర్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ప్రధానమైన నలుగురు మండలాధికారులు తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ కోట వీరబాబు, టేకులపల్లి, బోడు ఎస్ఐలు గన్‌రెడ్డి రమణారెడ్డి, బత్తిని రంజిత్‌లు బదిలీ కావడం గమనార్హం. ఈ మేరకు బుధవారం వారు విధుల్లో చేరారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో పని చేస్తున్న ఎస్.నాగభవానీ టేకులపల్లి తహసీల్దార్‌గా, గడదాసు రవీంద్రరావు ఎంపీడీఓగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇల్లెందులో ఎస్ఐగా పని చేసిన షేక్ సైదా రహూఫ్ టేకులపల్లి ఎస్ఐగా, అశ్వారావుపేటలో పని చేస్తున్న పి.శ్రీకాంత్ బోడు ఎస్ఐగా విధుల్లో చేరారు. ఆ తరువాత ఇల్లెందు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎంపీడీఓగా ధన్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన బాలరాజు మహబూబాబాద్ జిల్లాకు బదిలీకాగా అక్కడి నుంచి ధన్‌సింగ్‌ను ఇల్లెందుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని రెండు గ్రామపంచాయతీల పరిధిలో నలుగురు కార్యదర్శులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలాజీనగర్ కార్యదర్శి నీలిమను తిలక్‌నగర్ గ్రామపంచాయతీకి, తిలక్‌నగర్ కార్యదర్శి తిరుపతిరావును బాలాజీనగర్‌కు, సుదిమళ్ల గ్రామపంచాయతీ కార్యదర్శి నాగమణిని ముత్తారపుకట్టకు, ముత్తారపుకట్ట కార్యదర్శి అజహర్‌ను సుదిమళ్ల గ్రామపంచాయతీకి బదిలీ చేశారు. ఆయా కార్యదర్శులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.





చుంచుపల్లి: డీఆర్డీఓ విద్యాచందనకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు, ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలిసిన కార్యాలయ సిబ్బంది

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



సింగరేణి(కొత్తగూడెం): దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు



టేకులపల్లి: సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్న అంగన్‌వాడీలు

టేకులపల్లి: ఈనెల 16న కార్మిక, కర్షకుల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షురాలు వై.ఇందిర పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మికులు, రైతులకు నష్టం వాటిల్లే జీఓలను తీసుకొచ్చి బడా పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. దీనిని అడ్డుకునేందుకు సమ్మెలో జకల జనులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంధ్యారాణి, పద్మ, వరమ్మ, నాగమణి, విజయలక్ష్మి, సునీత, పద్మ, బిచ్చాలి, చాంది తదితరులు పాల్గొన్నారు. దేశ వ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ టేకులపల్లి మండలంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు ఎంపీడీఓ జి.రవీంద్రరావుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మూడు బిచ్చు, సరికొండ నాగేశ్వరరావు, కణతాల అన్నాజీ, కత్తుల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని, ఏఐకేఎంఎస్ నాయకులు కోరారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఢిల్లీలో రైతులపై పోలీసులు లాఠీచార్జీని నిరసిస్తూ ఏఐకేఎంఎస్ అధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు.

విద్యార్థి సంఘాల మద్దతు...

ఈనెల 16న, జరిగే భారత్ బంద్‌కు విద్యార్థి సంఘాల మద్దతు ఉంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్ దాదా, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు మంజుల, ఎస్ఎఫ్ఐ రామ్ చరణ్, పీడీఎస్‌యూ సంధ్య తెలిపారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.కార్యక్రమంలో శ్రీను, రణధీర్, శివ, విజయ్, కాంత్, రోహిత్, సన్ని పాల్గొన్నారు.